చేనేత సమస్యలపై రేపు సమావేశం

హిమాయత్ నగర్, మే 24: రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు సోమవారం హిమాయత్‌నగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి లక్ష్మినర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకుల నిర్లక్ష్యంతో చేనేత పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘాల రుణాలతో పాటు నేతన్నల రుణాలన్నిటినీ మాఫీ చేయాలని, చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు వెంటనేఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూకు రూ.5కోట్ల గ్రాంట్

కొండాపూర్, మే 24: డిజిటల్ ట్విన్ టెక్నాలజీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ఏర్పాటు కోసం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) రూ.5 కోట్ల గ్రాంట్ ను మంజూరు చేసింది. హెచ్ఏఎల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా అందజేస్తున్న నిధులతో వర్సిటీలో పరిశోధన, ఆవిష్కరణ సామర్థ్యాలకు పెద్దఎత్తున మేలు జరుగుతుందని వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. ఈ ప్రతిపాదనకు నాయకత్వం వహిస్తున్న ప్రొఫెసర్లు స్మామ్రాట్ సబత్, సిబ ఉద్గాట, ఘనశ్యాం కృష్ణ కృషి వల్లే గ్రాంట్ మంజూరైనట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులను సమగ్ర పరిశోధన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు వినియోగిస్తామన్నారు. హెచ్ఏఎల్ గ్రాంట్‌తో అత్యాధునిక డిజిటల్ ట్విన్ ల్యాబ్ ప్రాక్టిక్స్ డెవలప్మెంట్ కోసం శిక్షణ లాబ్స్, విద్యార్థులు, పరిశోధకుల నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో నిరంతర శిక్షణ, వర్క్‌షాపులు నిర్వహించేందుకు ఆడిటోరియం నిర్మించనున్నట్లు తెలిపారు.

కవలలకు కిమ్స్ జీవం

- బిలాస్‌పూర్‌లో నెలలు నిండకముందే కవలల జననం
- ఇన్‌ఫెక్షన్లు, ప్లేట్‌లెట్లు పడిపోయి ప్రాణపాయ స్థితిలో పిల్లలు
- ప్రత్యేక విమానంలో హైదరాబాద్ కిమ్స్‌కు తరలింపు
- నెలరోజుల చికిత్స అనంతరం ఆరోగ్యవంతులుగా చిన్నారులు

పూర్తిగా కోలుకున్న చిన్నారులతో కిమ్స్ వైద్య సిబ్బంది

సిటీబ్యూరో, మే24, (నమస్తే తెలంగాణ): కవలలు పుట్టారనే సంతోషం కంటే నెలలు నిండక మందే పుట్టారనే దుఃఖం.. అందులో ఇద్దరు చిన్నారులకు తీవ్రస్థాయి ఇన్ఫెక్షన్, ప్లేట్‌లెట్లు పడిపోయాయనే బాధ ఆ తల్లిదండ్రులను మానసికంగా కలిచివేసింది. అయితే మరణం అంచున ఉన్న చిన్నారులిద్దరికి నెలరోజుల పాటు అత్యుత్తమమైన వైద్య చికిత్సలందించి పునర్జన్మ ప్రసాదించారు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు. ఆస్పత్రి నియోనాటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్, ఎన్ఐసీయూ అధిపతి, నియోనాటాలజీ, పీడియాట్రిక్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అపర్ణ తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌కి చెందిన ఓ మహిళకు నెలలు నిండకముందే 1.4, 1.5 కిలోల బరువుతో కవలలు జన్మించారు. ఇద్దరికీ విపరీతమైన ఇన్ఫెక్షన్ల కారణంగా ప్రాణాపాయ స్థితి ఏర్పడటంతో వాళ్లను హుటాహుటిన ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని కిమ్స్ కడల్స్ కొండాపూర్ ఆస్పత్రికి తరలించారు. పిల్లలిద్దరిలో ఒకరి పరిస్థితి అక్కడినుంచి తీసుకొచ్చే సమయంలోనేవిషమంగా మారింది. రక్తంలో ఫంగల్ ఇన్ఫెక్షన్‌తో పాటు డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా (క్లెబిసెల్లా) ఇన్ఫెక్షన్ కారణంగా శరీరంలో కీలక అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. దాంతో ముందుగా వెంటిలేటర్ మీద పెట్టి, తర్వాత రక్తపోటుకు సంబంధించిన మందులిచ్చాం.కిడ్నీలు కూడా పనిచేయకపోవడంతో 24 గంటల పాటు మూత్ర విసర్జన కాలేదు. రెండో బాబుకు ఫంగల్ సెప్సిస్ కావడంతో ముక్కు ద్వారా సీపీఏపీ (కంటిన్యువస్ పాజిటివ్ ఎయిర్ వే ప్రెషర్) ఇవ్వాల్సి వచ్చింది. పిల్లలిద్దరికీ ప్లేట్‌లెట్ కౌంట్ బాగా పడిపోవడంతో పలుమార్లు రక్తం, ప్లేట్‌లెట్లు ఎక్కించాం. ఇలా దాదాపు నెలరోజుల పాటు పలు రకాల చికిత్సలు చేసిన తర్వాత పిల్లలిద్దరికీ ఇన్ఫెక్షన్లు పూర్తిగా తగ్గాయి. ప్రస్తుతం తల్లి పాలు తాగగలుగుతున్నారు. బరువు కూడా సుమారు 2 కిలోలకు చేరుకున్నారు. వాళ్లకు రెటీనా స్క్రీనింగ్, వినికిడి పరీక్ష, మెదడు స్కానింగ్ (న్యూరోసోనోగ్రామ్) లాంటి పరీక్షలు నిర్వహించాం. వాళ్లిప్పుడు ఆరోగ్యంగా ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. కవల పిల్లల్ని మొదటిసారిగా ప్రత్యేక విమానంలో తీసుకురావడం ఇదే మొదటిసారి' అని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా కిమ్స్ కాడల్స్ ఆసుపత్రిలో డాక్టర్ రాజశేఖర్, ఐసీఏటీటీ బృందం, ప్రత్యేక నిపుణులు వంశీ, అరవింద, ప్రణీత, సునీత, నర్సుల బృందం పిల్లలిద్దన్ని కంటికి రెప్పలా కాపాడాయాన్నారు.అత్యాధునిక వైద్యసదుపాయాలు, నిపుణులు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటం ఇలాంటి కేసుల్లో ఎంతో అవసరమన్నారు. చికిత్స అనంతరం పిల్లలను డిశ్చార్జ్ చేసి పంపించినట్లు తెలిపారు. వారి భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా లేదని వైద్యులు నిర్ధారించారు.

ట్యాక్స్ వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సిటీ బ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): నిర్దేశించిన లక్ష్యం మేరకు ట్యాక్స్ వసూలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వార్ హాల్‌లో టౌన్‌ప్లానింగ్ అడిషనల్ సీసీపీ, డిప్యూటీ కమిషనర్లు, ఏసీపీలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కంటెంప్ట్ కోర్టు కేసులపై సమీక్ష నిర్వహించారు. బిల్ కలెక్టర్లు రెసిడెన్షియల్ ట్యాక్స్‌తో పాటుగా ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని డిప్యూటీ కమిషనర్‌లను ఆదేశించారు. రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌గా మార్చి పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. డీసీలతో ట్యాక్స్‌పై అడిషనల్ కమిషనర్ కూడా రివ్యూ చేయాలని ఆదేశించారు. అంతకుముందు కమిషనర్ వివిధ జోన్లలో ఉన్న కంటెంప్ట్ కేసులకు సరైన సమాధానం ఇవ్వాలని అధికారులకు కోర్టు తీర్పు ప్రకారం నడుచుకోవాలని సూచించారు. అవసరమైన సహాయం కోసం లీగల్ ఓఎస్డీ, అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ, సీసీపీ శ్రీనివాస్‌ను సంప్రదించాలని అన్నారు. వచ్చే వారంలో రిట్ పిటిషన్‌లపై రివ్యూ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్లు, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

26న స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సు

అమీర్‌పేట్, మే 24: యువతలో భారతీయ సాంప్రదాయ సంగీతం మరియు సంస్కృతిని ప్రోత్సహించే 'స్పిక్ మైకే'.. 10వ అంతర్జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈనెల 26 నుంచి జూన్ 1 వరకు ఐఐటీ హైదరాబాద్ ఆవరణలో (కంది) జరగనున్న ఈ సదస్సుకు సంబంధించిన వివరాలను శనివారం అమీర్‌పేట్‌లోని హోటల్ మ్యారీగోల్డ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో 'స్పిక్ మైకే' వ్యవస్థాపకులు, పద్మశ్రీ డాక్టర్ కిరణ్ సేట్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, సంస్థ జాతీయ చైర్మన్ ఆర్ఎం తివారీ, సదస్సు కన్వీనర్లు కోనా లక్ష్మీ వల్లి, కళాపూర్ణ నల్లతో కలిసి వెల్లడించారు. సోమవారం నుంచి ఏడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో దేశ విదేశాలకు చెందిన విద్యార్థులు చారిత్రక, సంగీత సంప్రదాయ అంశాలకు సంబంధించి అనేక విషయాలను సంగ్రహించే వీలు కలుగునుంది. ఈ సదస్సులో పద్మ విభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా (హిందుస్థానీ ఫ్లూట్), పద్మభూషణ్ బేగంపర్వీన్ సుల్తానా (హిందుస్థానీ వోకల్), పద్మభూషణ్ డాక్టర్ రాజం (హిందుస్థానీ వయోలిన్) వంటి ప్రముఖులు తమ సంగీత కళా ప్రదర్శనలు ఇవ్వనున్నారని తెలిపారు.

కేఎల్‌హెచ్ విద్యార్థికి డాక్టరేట్

సిటీ బ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అజీజ్ నగర్ క్యాంపస్ పరిశోధక విద్యార్థి వీ సాయిబాబు డాక్టరేట్‌కు అర్హత సాధించారని కేఎల్ హెచ్ ఈసీఈ రీసెర్చ్ విభాగాధిపతి ప్రొఫెసర్ అనిల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆకెళ్ల రామకృష్ణ మార్గనిర్దేశంలో నిద్ర సంబంధిత రుగ్మతలను సైకో అకౌస్టిక్స్ ఆధారంగా గుర్తించి విశ్లేషించే ప్రక్రియ గురించి పరిశోధనలు చేసి సిద్ధాంత వ్యాసాలు సమర్పించినట్లు తెలిపారు. సాయిబాబు డాక్టరేట్‌కు అర్హత సాధించడంపై యూనివర్సిటీ డీన్ ఆర్అండ్‌డీ ప్రొఫెసర్ బీటీ పీ మాధవ్ తదితరులు అభినందించారు.

నేడు అదనపు బస్సు సర్వీసులు

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): నేడు జరిగే యూపీఎస్సీ పరీక్షల నేపథ్యంలో గ్రేటర్‌లో బస్సు సర్వీసులను పెంచినట్లు ఆర్టీసీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్సుల సమాచారం కోసం రేతిఫీల్, కోఠిలో కమ్యూనికేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోఠి: 99592 26160, రేతిఫీల్: 99592 26154 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని వివరించారు.

మళ్లీ కొవిడ్ టెస్టులు!

(మొదటిపేజీ తరువాయి)

అలాగే 60 బెడ్లతో కూడిన 3 కరోనా వార్డులను సిద్ధం చేశామని చెప్పారు. ఇందులో అత్యవసర రోగుల కోసం 15 బెడ్లతో స్పెషల్ వార్డును ఎమర్జెన్సీ విభాగం వెనక ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ కొవిడ్ నిబంధనలు పాటించాలని.. ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలన్నారు

కొవిడ్ కమిటీ ఇదే

కొవిడ్ కమిటీ చైర్మన్ గా సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, నోడల్ ఆఫీసర్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ ఎల్ సునీల్ కుమార్ వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కే సునీల్ కుమార్, ఆర్ఎంవో –1 డాక్టర్ శేషాద్రి, పల్మనాలజీ హెచ్‌వోడీ డాక్టర్ కృష్ణమూర్తి, అనస్థీషియా హెచ్‌వోడీ ఆవుల మురళీధర్, పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ వాసుదేవ్, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాధా, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పూజ, డ్యూటీ ఆర్ఎంవో, పీజీ వైద్యులు ఉన్నారు. కొవిడ్ పాజిటివ్ బాధితులు గాంధీలో అడ్మిట్ అయిన పరిస్థితుల్లో వారికి అందించే అత్యవసర వైద్యం, తదితర వసతులపై ఈ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుందని డిప్యూటీ డాక్టర్ కే సునీల్ కుమార్ తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ

చిక్కడపల్లి, మే24: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 27న ఇదిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గాంధీనగర్ సబర్మతినగర్ లోని అంబేద్కర్, పూలే విగ్రహాల సమక్షంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షకు పెద్ద ఎత్తున ఉద్యమకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కోశాధికారి చంద్రశేఖర్ ప్రసాద్, వేదిక అధ్యక్షుడు యాదగిరి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, మల్లేశ్ సాయి పాల్గొన్నారు.

లెక్చరర్ల కొరత.. తగ్గుతున్న ఉత్తీర్ణత

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ప్రభుత్వ ఇంటర్ కాలేజీల విద్యార్థులు అధ్యాపకుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం సిలబస్‌లో 40 శాతం కూడా తరగతులు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత అవ్వడమే కత్తిమీద సాములా మారుతుందని తెలిపారు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో ప్రభు త్వ ఇంటర్ కాలేజీల నుంచి 42,562 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, కేవలం 48 శాతం మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అది కూడా అరకొర మార్కులతో పాసవ్వడం ఆందోళన కలిగిస్తున్నదని విద్యా నిపుణులు చెబుతున్నారు.

మొత్తం 243 కాలేజీలు

గ్రేటర్ పరిధిలో హైదరాబాద్ లో 22, రంగారెడ్డిలో 218, మేడ్చల్‌లో 5 కలుపుకొని మొత్తం 243 ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కాలేజీలు నడుస్తున్నాయి. వీటి నిర్వహణ మాత్రం అధికారులు గాలికొదిలేశారు. ఫలితంగా సర్కా ర్ కాలేజీల్లో చదివే విద్యార్థులు విద్యలో వెనకంజలో ఉంటున్నారు. కొందరు మధ్యలోనే కాలేజీ మానేయగా.. మరికొందరూ ఫెయిలై చదువుకు దూరమవుతున్నారు.

ఫీజులు భరించలేక..

ప్రైవేటు కాలేజీల్లో ఫీజులు ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ కలుపుకొని ఇతర ఖర్చులతో సుమారు రూ. 2–4లక్షల వరకు ఖర్చు అవుతుంది. అంత స్థోమత లేక నగరంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు కాలేజీల్లో చేర్పిస్తున్నారు. కానీ సరిపడా లెక్చరర్లు లేక వారి భవిష్యత్ ప్రశ్నార్థకమవుతున్నది. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత మూడు, నాలుగు నెలలైనా కూడా పాఠ్య పుస్తకాలు అందడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

ఒకేషనల్ కోర్సుల్లోనూ..

పలు కాలేజీలో ఫస్ట్ లాంగ్వేజ్ ఇంగ్లిష్‌తో పాటు ఎకనామిక్స్, , కామర్స్, ఫిజిక్స్, బాటనీ పాఠాలను బోధించే వారు కూడా లేరని తెలిపారు. మరోవైపు ఒకేషనల్ కోర్సుల్లోనూ ఇదే దుస్థితి నెలకొంటున్నది. ఏటా 40 శాతం వరకు కూడా క్లాస్‌లు జరగకపోవడంతో వారు నిరాశ చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల్లోపు ఖాళీలు ఉన్న చోట గెస్ట్ లెక్చరర్లను తీసుకుని బోధన ప్రక్రియను ప్రారంభించాల్సి ఉండగా ఇంటర్ బోర్డు మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత అక్టోబర్ మొదటి వారం వరకు కూడా నియామకాలు జరగకపోవడంతో బోధన అంతంత మాత్రంగానే సాగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఐఐసీటీ మాజీ సైంటిస్ట్‌కు అరుదైన గౌరవం

ఆర్ఆర్‌సీకి చైర్‌గా ఎంపికైన మనోరమ

సిటీబ్యూరో, మే 24(నమస్తే తెలంగాణ): కేంద్ర అణు ఇంధన శాఖ డా.రాజారామన్న చైర్(ఆర్ఆర్‌సీ)గా ఐఐసీటీకి చెందిన మాజీ సైంటిస్ట్ డా.మనోరమ సుంకర వర్దిరెడ్డి ఎంపికయ్యారు. మెటీరియల్ సైన్స్, కెమికల్ సెన్సార్స్, నానో మెటీరియల్స్ అధ్యయనంలో ఆమె చేసిన కృషికి ఈ గౌరవం దక్కింది. భారత అణు కార్యక్రమంలో ప్రముఖ ఆర్కిటెక్ట్‌గా సేవలందించిన డా.రాజారామన్న పేరిట ఏటా అత్యంత సున్నితమైన, వ్యూహాత్మక పరిశోధన రంగాల్లో సేవలు అందించి పదవీ విరమణ పొందిన సైంటిస్టులు, ఇంజనీర్లు, టెక్నోగ్రాట్లను గుర్తించి వారి సేవలను వినియోగించుకోనున్నారు. డా.మనోరమ ఫిజిక్స్ విభాగంలో అనేక పరిశోధనలతోపాటు కెమికల్ సెన్సార్ రంగంలో అత్యంత కీలకమైన అంశాలలో అధ్యయనం చేశారు. అణు రియాక్టర్లలో వెలువడే విషవాయులు, పేలుడు వాయువులను గుర్తించే బయో సెన్సార్ల రూపకల్పనలో ఆమె కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా మూడో తరం సోలార్ సెల్స్, ఎంఆర్ఐ కాంట్రాస్ట్ ఏజెంట్లు, బయోమెడికల్ డివైజ్‌ల ఆవిష్కరణకు మెటీరియల్ సైన్స్‌లో ఆమె చేసిన పరిశోధనలు కీలకంగా మారాయి. ఇలా పరిశోధన రంగంలో 130కి పైగా రీసెర్చ్ పబ్లికేషన్లు, 20 పరిశోధన పత్రాలతో యువ పరిశోధకులుగా తీర్చిదిద్దే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లోనూ ఆమె చురుకైన పాత్రను పోషించారు.

స్కేటింగ్.. అదుర్స్

జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా ఇందిరా పార్క్ వెలోడ్రోమ్‌లో శనివారం స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు. కోచ్‌లు నూర్ మహమ్మద్, షేక్ మాజిద్ పిల్లలకు స్కేటింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు.

– సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

మాధవ్‌కు ఎన్టీఆర్ కళాసాహితీ పురస్కారం

ముషీరాబాద్, మే 24: కళారవిందం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో ఎన్టీఆర్ కళాసాహితి పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి ఎస్ వేణుగోపాలచారి ముఖ్యఅతిథిగా హాజరై.. సినీ రచయిత బుర్రసాయి మాధవ్‌కు ఎన్టీఆర్ కళాసాహితి పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వంశీ రామరాజు, రామ్‌కుమార్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లకు శిక్షణ తరగతులు నిర్వహించాలి

తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు వైర్‌మన్ అండ్ సూపర్‌వైజర్ పర్మిట్లు తీసుకుని ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా పనిచేసుకోవాలని.. అదేవిధంగా గృహ, వాణిజ్య సముదాయాల్లో ప్రభుత్వం సర్టిఫై చేసిన ఎలక్ట్రీషియన్లతో పనిచేయిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రైవేటు ఎలక్ట్రికల్ సంఘం అభిప్రాయపడింది. శనివారం తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కయాదగిరి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎలక్ట్రీషియన్లు ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు ద్వారా వైర్‌మన్, సూపర్‌వైజర్ ఫార్మాట్ తీసుకోవాలని, వీరికి ప్రభుత్వపరంగా పదిహేనురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తే బాగుంటుందని యాదగిరి పేర్కొన్నారు. మార్కెట్‌లో నాసిరకమైన కేబుల్స్, స్విచ్‌లు అందుబాటులో ఉండటం వలన వినియోగదారులతో పాటు ఎలక్ట్రీషియన్లు కూడా మోసపోతున్నారని.. ఇప్పటికైనా కేబుల్స్, స్విచ్‌లకు సంబంధించిన కంపెనీలు నాణ్యమైన మెటీరియల్ అందుబాటులో ఉంచాలని సూచించారు. వినియోగదారులు కూడా మన్నికైన ఎలక్ట్రానిక్ పరికరాలనే కొనుగోలు చేయాలి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేమాల బెనర్జీ, రాజుమహారాజు, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తీసుకున్న రైతులతో వీసీ రాజిరెడ్డి, వర్సిటీ సిబ్బంది

ఔషధ మొక్కలకు డిమాండ్

వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మే 24: ఔషధ మొక్కల సాగుతో ఆరోగ్యంతోపాటు ఆదాయం కూడా అధికంగా ఉంటుందని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ డీ రాజిరెడ్డి పేర్కొన్నారు. ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన కేంద్రం రాజేంద్రనగర్‌లో 'మిషన్ ఇన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ 2024 –25' అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఔషధ మొక్కల సాగు చేస్తున్న రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా శాస్త్రవేత్తలు, సాంకేతికా నిపుణులు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఔషధ మొక్కల పెంపకం ఎంతో సులువైందని వీటికి తక్కువ యాజమాన్య పద్ధతులు అవసరమవుతాయని తెలిపారు. చీడపీడల బెడద చాలా తక్కువ ఉంటుందని, రైతులు మిగతా పంటలకు కూడా చీడపీడల నుంచి రక్షించుకునేందుకు ఔషధ మొక్కలను నాటుకోవచ్చని తెలిపారు. సరైన మార్కెటింగ్ ఉంటేనే రైతులు మంచి లాభాలను ఆర్జిస్తారని వివరించారు. తెలంగాణ ప్రాంతంలోని నేలలన్నీ ఔషధ పంటలకు అనుకూలమేనని అన్నారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో రైతులకు అవసరమయ్యే విధంగా ఔషధ సుగంధ ద్రవ్య మొక్కలను నర్సరీలలో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. రైతులు ఔషధ మొక్కల పెంపకంపై దృష్టిసారించాలని వీసీ కోరారు రిజిస్టర్ డాక్టర్ భగవాన్, డీన్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మినారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ సురేష్ కుమార్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ చీనానాయక్, కూరగాయల పరిశోధన కేంద్రం హెడ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ అనిత కుమారి, ఉద్యాన కళాశాల రాజేంద్రనగర్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్, ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన స్థానం హెడ్, శాస్త్రవేత్త శ్రీమతి కృష్ణవేణి, తెలంగాణ మెడిసినల్ ప్లాంట్ బోర్డ్ హైదరాబాద్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్స్ హైదరాబాద్ డాక్టర్ జ్ఞానేశ్వర్ , శాస్త్రవేత్తలు బోధన, బోధ నేతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీవోల సంతకాలు ఫోర్జరీ

- అలాట్‌మెంట్ లెటర్లు ఇచ్చి లక్షలు వసూలు
- 'డబుల్' ఇండ్ల పేరుతో మోసం

బంజారాహిల్స్,మే 24: ఒడిశాకు చెందిన సంకర్షన్ దాస్‌శ్రీకృష్ణానగర్‌లో నివాసం ఉంటూ ప్లంబర్‌గా పనిచేస్తుంటాడు. గతంలో బంజారాహిల్స్‌రోడ్ నెం 2లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్లంబింగ్ పనులు చేస్తున్నప్పుడు అక్కడ ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్న చిత్తూరు జిల్లా జానాపల్లికి చెందిన నాగరాజు రెడ్డితో పరిచయం ఏర్పడింది. తనకు జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న వ్యక్తులతో పరిచయాలు ఉన్నాయని, గత ప్రభుత్వంలో నిర్మించిన కొన్ని డబుల్ బెడ్‌రూమ్‌లను ఇప్పిస్తానని నమ్మబలికారు. దీనికోసం ప్రసాద్ ల్యాబ్స్‌లో రూ.2.50లక్షలు తీసుకున్న నాగరాజు రెడ్డి బోగస్ అలాట్‌మెంట్ లెటర్‌ను అందించారు. సంకర్షన్‌దాస్‌తో పాటు మరికొంతమంది స్నేహితులు కలిసి మొత్తం రూ.17 లక్షలదాకా నాగరాజురెడ్డికి అందజేశారు. వారందరికీ అలాట్‌మెంట్ లెటర్లు ఇవ్వగా వాటిని తీసుకుని డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లవద్దకు వెళ్లగా అవి బోగస్ అని తేలింది. రాజేంద్రనగర్, మల్కాజిగిరి ఆర్డీవో సంతకాలను ఫోర్జరీ చేసి బోగస్ లెటర్లు ఇచ్చినట్లు తేలింది. వాటిని తీసుకుని సంబంధిత ఆర్డీవోలను కలవగా తాము ఎలాంటి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వలేదని స్పష్టం చేశారు. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నాగరాజు రెడ్డితో పాటు పలువురి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజావసరాల స్థలాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత

హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైడ్రా కార్యాలయంలో అధికారులు, నిపుణులతో సమావేశం

హైడ్రా కార్యాలయంలో సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): లేఔట్ ఏదైనా అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని హైడ్రా సదస్సులో నిపుణులు అభిప్రాయపడ్డారు. శనివారం హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో జరిగిన సదస్సులో హైడ్రా, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలకు చెందిన పలువురు నిపుణులు హాజరయ్యారు. 10శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయితే ఆ లేఔట్లను గుర్తించాల్సిన అవసరం ఉందని, ఒకవేళ అందులో మార్పులు చేయాల్సి ఉంటే అప్పటికే ప్లాట్లు కొన్నవారి అనుమతితో రివైజ్ చేయాల్సి ఉంటుందని, అదే సమయంలో పదిశాతం పార్కులు, ప్రజావసరాలకు కేటాయించాల్సిందని పలువురు అధికారులు తెలిపారు. పంచాయతీ, మున్సిపాలిటీ, డీటీసీపీ, హెచ్ఎండీఏ.. ఇలా ఏ స్థాయిలో లేఔట్ అనుమతులు పొందినా అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలపై ప్రభుత్వానికి హక్కులుంటాయని తెలిపారు. అన్‌ఆథరైజ్డ్, అన్ అప్రూవల్, అప్రూవల్ లేఔట్లు ఏంటనే వాటిపై సంబంధిత జీఓలను పరిశీలించారు. ఎకరం స్థలంతో మొదలై ఎంత విస్తీర్ణంలో లేఔట్లు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయా విషయాలపై సమగ్రంగా చర్చించారు.

లేఔట్లను రికార్డుల్లో నమోదు చేయాలి..

దశాబ్దాల క్రితం గ్రామ పంచాయతీలు అనుమతి ఇచ్చిన లేఔట్ల విషయం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాల్సిన అవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది. సదరు భూమి లేఔట్‌గా మారిందనే విషయం రికార్డుల్లో నమోదు కాకపోవడంతోనే తర్వాత తరంవారు పాసుపుస్తకాలు తెచ్చుకుని ఆయా స్థలాలమీదకు వెళ్లి వ్యవసాయభూమి పేరిట ఆక్రమణలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి పొందిన పాత లేఔట్ల విషయంలో కొన్ని ప్లాట్లు రెగ్యులరైజ్ అయితే ఆ లేఔట్‌ను గుర్తించినట్లేనని, తర్వాత ఆ భూమిని వ్యవసాయభూమిగా మార్చడం జరుగుతున్నదని, ఒకవేళ రద్దు చేస్తే అందులో ప్లాట్లు కొన్నవారి అనుమతితో మాత్రమే చేయాల్సి ఉంటుందని సూచించారు. ప్రిలిమనరీ అప్రూవల్‌తో అమ్మకాలు జరపవచ్చని అయితే లేఔట్ స్వరూపం మార్చవద్దని పేర్కొన్నారు. తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన వాటిపైన చర్యలు తీసుకోవచ్చని సదస్సులో నిపుణులు తెలిపారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులపై చర్చించారు.

చెరువు పరిధిలో నోటీసులు అవసరం లేదు..

చెరువు పరిధిలో నిర్మించిన కట్టడాల విషయంలో కూడా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేకుండా తొలగించవచ్చని, రహదారులు, పార్కుల్లో నిర్మాణాలు చేపట్టినా ఇది వర్తిస్తుందని సూచించారు. అలాగే రెగ్యులరైజ్ చేసిన ఇంటి స్థలాలు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే వాటిని రద్దుచేసే అధికారం ఉంటుందని, పాత, కొత్త లేఔట్లు ఉన్న సమయంలో పాత లేఔట్‌లో రిజిస్ట్రేషన్లు జరిగితే వాటిని పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని, అలాగే ఫైనల్ లేఔట్ వస్తే అందులో ఎలాంటి మార్పులు చేయరాదంటూ సుప్రీం కోర్టు గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపుపై కమిషనర్ రంగనాథ్ సదస్సుకు హాజరైన నిపుణులతో చర్చించారు.